

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

లోకేశ్వరం, మార్చి 18 : మండల కేంద్రానికి చెందిన పలు కుటుంబాలను ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ సోమవారం పరామర్శించారు. దోడొల్ల రసూల్, గొల్ల పెద్దన్నలకు చెందిన గొర్రెలు ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి వద్దకు వెళ్లారు. ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే బొతొల్ల ముత్తన్న అనే వ్యక్తి మృతి చెందగా.. ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీటీసీ జైసాగర్ రావు, మాజీ సర్పంచ్ శ్రీధర్, నాయకులు చిన్నారావు, గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

జఠిలం

(ఫైల్)





- జిల్లాలో గణనీయంగా తగ్గిపోతున్న భూగర్భ జలాలు
- తొమ్మిది మండలాల్లో డేంజర్ బెల్స్
- భూగర్భ జలాల పెంపునకు రీఛార్జ్ శాఫ్ట్ సిస్టం
- చెక్ డ్యాంల, నాళాల వద్ద ఓపెన్ బోర్లు
- అర్బన్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- సీసీ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణాలతో భూగర్భ జలాలకు ముప్పు

నిర్మల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రోజురోజుకూ నీటి సమస్య జఠిలం అవుతోంది. ప్రతీయేడు నీటికి ఏటేటా నీటి వినియోగం విపరీతంగా పెరుగుతున్న కారణంగా భూగర్భ జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. వర్షపాతం ఎక్కువగానే నమోదవుతున్నప్పటికీ భూగర్భంలో నీరు నిల్వ ఉండకపోతుండడంపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. భూగర్భంలో నీటి నిల్వల శాతాన్ని పెంచేందు కోసం కృత్రిమ పద్ధతిలో ఓ కార్యాచరణను చేపడుతున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ఇక్కడి భూగర్భ జల శాఖ అధికారులు సంయుక్తంగా రీఛార్జ్ శాఫ్ట్ అనే సిస్టంను తెరపైకి తెచ్చారు. ఈ కృత్రిమ విధానంతో భూగర్భ జలాలు క్రమంగా పెరిగే అవకాశాలుంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. చెక్ డ్యాంలు, వాగులు, ఒర్రెలు, నాళాల వద్ద ఈ రీఛార్జ్ శాఫ్ట్‌లను ఏర్పాటు చేసుకున్నారు. చెక్ డ్యాంల లోపల వాటి బెడ్‌లకు అనుకొని 20 సెంటీమీటర్ల కేసింగ్‌తో కూడిన ఓపెన్ బోరు బావులను తవ్వుతున్నారు. ఈ ఓపెన్ బోరు బావుల కారణంగా చెక్ డ్యాంలలోను, నళాలు, వాగులు, ఒర్రెల వద్ద నీటి ప్రవాహం కొనసాగుతుండగానే భూగర్భంలోకి నీరు చేరుకొని నేలంతా విస్తరిస్తుందంటున్నారు. దాదాపు 100 అడుగుల లోతులో ఈ బోరుబావులను తవ్వుతున్నారు. కాగా అర్బన్ ప్రాంతాల్లో గణనీయంగా భూగర్భ జలాలు తగ్గిపోతుండడాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. అర్బన్ ప్రాంతాల్లో గత కొంత కాలం నుండి సీసీ రోడ్ల నిర్మాణాలు, డ్రైయిన్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్న కారణంగా వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు లేకుండా పోయాయి. దీంతో భూగర్భ జలాల నిల్వలు ఆశించిన మేరకు ఉండడం లేదంటున్నారు. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా అర్బన్ ప్రాంతాల్లోని ఒర్రెలు, చిన్నపాటి వాగులు, నాళాల వద్ద కూడా ఇలా రీఛార్జ్ శాఫ్ట్‌లను ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. జిల్లాలోని తొమ్మిది మండలాల్లో భూగర్భ జలాలు అత్యంత వేగంగా పడిపోతుండడం అధికారులను ఆందోళనకు గురిచేస్తుంది. నిర్మల్ అర్బన్‌తో పాటు రూరల్ ప్రాంతాల్లో పది మీటర్ల లోతులోకి నీటి నిల్వలు పడిపోయాయని అధికారులు చెబుతున్నారు.



భూగర్భ జల శాఖ కార్యాలయం ఇదే

● కృత్రిమ పద్ధతిలో రీఛార్జ్ శాఫ్ట్‌లు

భూగర్భ జలాల పెంపు కోసం అధికారులు కృత్రిమ పద్ధతిలో ఈ రీఛార్జ్ శాఫ్ట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. చెక్ డ్యాంలు, ఒర్రెలు, నాళాల వద్ద 4 మీటర్ల లోతుతో కేసింగ్‌లతో కూడిన ఓపెన్ బోరు బావులను తవ్వుతున్నారు. ఈ ఓపెన్ బోరు బావుల ద్వారా వర్షాకాల ప్రవాహ సమయంలోను, వర్షాకాలంలోను నీరంతా భూమిలోకి వెళ్లి నలు దిశలా విస్తరించే అవకాశం ఉందని చెబుతున్నారు. భూగర్భ జల శాఖ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ ఈనటి ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. ఈ రీఛార్జ్ శాఫ్ట్‌ల ద్వారా క్రమంగా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందంటున్నారు.

● ఇసుక నేలల్లోనూ చెక్‌డ్యాంల నిర్మాణాలు

ఇప్పటి వరకు నిర్మిస్తున్న చెక్ డ్యాంలు నల్ల రేగడితో పాటు మొరం భూములతో పాటు ఇసుక నేలల్లోనూ నిర్మిస్తున్నారు. అయితే నల్ల రేగటి భూములతో నిర్మిస్తున్న చెక్ డ్యాంల ద్వారా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదని భూగర్భ జల శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. రేగడి నేలల్లో నిర్మించే చెక్ డ్యాంలలో నిల్వ ఉండే నీరంతా కొద్ది రోజుల్లోనే ఇంకిపోతోందని.. దాంతో ప్రయోజనం ఉండడం లేదంటున్నారు. మొరం భూముల్లో నిర్మించే చెక్ డ్యాంలు కొంతమేరకు ప్రయోజనం ఇస్తున్నప్పటికీ.. ఇసుక నెలలోనే ఇకనుంచి చెక్ డ్యాంలను నిర్మించాలంటూ అధికారులు సూచిస్తున్నారు. ఇసుక నేలలలో నిర్మించే చెక్ డ్యాంల ద్వారా భూగర్భంలోకి నీరు ఎక్కువగా ఇంకుతుందని దీని కారణంగా భూగర్భ జలాల పెంపునకు ఎంతో దోహదపడుతుందని పేర్కొంటున్నారు. ఇక నుంచి ఎక్కువ ఇసుక ప్రవహించే చోటనే చెక్ డ్యాంలను నిర్మించే విధంగా చర్యలు తీసుకోబోతున్నారు.

● వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

జిల్లాలోని తొమ్మిది మండలాల్లో భూగర్భ జలాలు అతివేగంగా పడిపోతున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. భైంసా, నిర్మల్ టౌన్, నిర్మల్ రూరల్, ముథోల్, కుంటాల, సోన్, దిలావర్‌పూర్, సారంగాపూర్, లోకేశ్వరం మండలాలలో నీటి నిల్వలు గణనీయంగా పడిపోతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మండలాలతో పాటు మిగతా మండలాలలో కూడా భూగర్భ జలాల పెంపునకు ఇక నుంచి రీఛార్జ్ శాఫ్ట్ విధానాన్ని అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

● కలెక్టర్ సిఫారసుల మేరకే..


చెక్ డ్యాంలో ఏర్పాటు చేసిన రీఛార్జ్ శాఫ్ట్ ఓపెన్ బోర్‌వెల్

జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల పెంపుకు ఇకనుండి రీఛార్జ్ శాఫ్ట్ విధానాన్ని అమలు చేయబోతున్నాం. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఈ కృత్రిమ విధానంపై చేసిన సిఫారసులను పరిగణలోకి తీసుకొని చెక్ డ్యాంలు, చిన్న వాగుల వద్ద రీఛార్జ్ శాఫ్ట్ పేరిట బోరు బావులను తవ్వి భూగర్భ జలాల పెంపుకు చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా అనుకూలమైన ప్రదేశాలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నాం.

- శ్రీనివాసరావు, డీడీ భూగర్భ జల శాఖ, నిర్మల్ జిల్లా


పోయిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

పంట నష్టంపై వ్యవసాయ అధికారుల సర్వే

లక్ష్మణచాంద, మార్చి18: ఈనెల 16వ తేదీన కురిసిన వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారి మంగ్లారపు ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. మునిపెల్లి, చామన్‌పెల్లి, తిరుపెల్లి, చింతల్‌చందా, పార్‌పెల్లి, ధర్మారం తదితర గ్రామాల్లోని వరి, మొక్కజొన్న, నువ్వు తదితర పంట పొలాల్లో ప్రాథమిక పంట నష్టాన్ని అంచనా వేశారు. ఈ అంచనా సర్వే ద్వారా 631 మంది రైతులకు చెందిన 1087 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని, ప్రభుత్వ ఆదేశానుసారం పూర్తి సర్వే నిర్వహించి పంట నష్టం వివరాల నివేదిక తయారు చేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఈవోలు పవిత్ర, ఉమామహేశ్వరి, తదితరులు ఉన్నారు.

గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను పటిష్టం చేయాలి

● డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ అర్బన్, మార్చి 18 : నిర్మల్ నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామంలో ఇంటింటికీ వివరించాలని సూచించారు. గ్రామ, మండల, పట్టణంలోని వార్డు కమిటీలను త్వరలో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజాప్రభుత్వంలో ప్రజలుఎంతో సంతోషంగా ఉండాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

పార్‌పెల్లి తండాలో గుడుంబాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

లక్ష్మణచాంద, మార్చి18: మండలంలోని పార్‌పెల్లి తండాలో తనిఖీలు చేసి బానోత్ రాజు అనే వ్యక్తి ఇంట్లో నుంచి నాలుగు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సల్లా శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు తనిఖీ చేయగా మొత్తం 100 లీటర్ల వరకు గుడుంబా తయారీకి ఉపయోగించే నానబెట్టిన బెల్లం పానకం లభ్యం కాగా, దీనిని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై గంగాధర్, పోలీస్ కానిస్టేబుళ్లు గణేష్, భూమన్న, మోహన్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించండి

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 18: జిల్లాలో ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంసీసీ, సర్వే లైన్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలైన్ బృందాలకు కలెక్టర్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యేల్ ప్రకటించినందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకునే రాజకీయ పార్టీలు, నాయకులకు, అభ్యర్థులకు సంబంధించిన వాహనాలు, ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. సి విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలు తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, పెట్రోల్ బంకులు ఇతర ప్రభుత్వ స్థలాల్లో వీటి తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే ముందు పబ్లిషర్ పేరు ఫోన్ నెంబర్ తప్పక తీసుకోవాలన్నారు. చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రతీవాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. 50 వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల సిబ్బంది అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్ రెడ్డి, తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

నగదు లావాదేవీలపై నిఘా పెట్టండి..

బ్యాంకర్లు రూ.50వేల కంటే ఎక్కువ మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరుపుతున్న ఖాతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. సోమవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ప్రతిరోజు బ్యాంకుల వారీగా నివేదికలు అందజేయాలన్నారు. ఏప్రిల్ 18 నుండి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారని తెలిపారు. పోటీ చేసే వారికి నూతన బ్యాంకు ఖాతా తెరవాలన్నారు. ఈడీఎం నదీమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బ్యాంకు లావాదేవీలు, క్యూఆర్ కోడ్ తదితర అంశాలపై వివరించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలి

దిలావర్‌పూర్, మార్చి 18: నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. దిలావర్‌పూర్‌లోని ఎన్ఆర్ఈజీఎస్ నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, ఏఏ మొక్కలు పెంచుతున్నారు. ఎన్ని మొక్కలు పెంచుతున్నారు. తదితర విషయాలను ఏపీవో దివ్యరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా తగిన నీరు, నీడా కల్పించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం కల్వ తండాలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. వేసవి కాలం దృష్ట్యా పాఠశాలల్లో చల్లని మంచినీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీవో అజీజ్ ఖాన్, ఏపీవో దివ్య రెడ్డి ఉన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పరీక్ష నిర్వహణ, పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు.


నర్సరీని పరిశీలిస్తున్న దృశ్యం

గుండంపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

దిలావర్‌పూర్, మార్చి18: మండలంలోని గుండంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీశివ పంచాయతన సైత పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మంగళహారతులు, భాజా భజంత్రీలతో మహిళలు, ఆంజనేయ స్వామి భక్తులు, గ్రామ పెద్దలు గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తర్వాత వేద పండితులు యజ్ఞ క్రతువులు ప్రారంభించారు. ఈ ఉత్సవాలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. బుధవారం తెల్లవారుజామున శ్రీ శివ పంచాయత పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

ఉరి వేసుకొని ఒకరి బలవన్మరణం

తానూర్, మార్చి18: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన కదం అంబాజీ (35) మద్యానికి బానిసై ఉరివే సుకొని మృతిచెందినట్లు ఎస్సై లోకం సందీప్ తెలిపారు. వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగించే అంబాజీ గత కొన్ని రోజులుగా తాగుడికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి 7గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేరని సమయం చూసి సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య కదం సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

తానూర్, మార్చి18: మండలంలోని దౌలతాబాద్ గ్రామానికి చెందిన రాజులొల్ల వెంకన్న(50) అనే రైతు ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాల ప్రకారం.. వెంకన్న వ్యవ సాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయనకు అప్పులు ఎక్కువై ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. సోమవారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి బయలు దేరి గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందాడు. మృతుడి భార్య రాజులొల్ల బోజాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పది తొలి పరీక్షకు 99.78శాతం మంది విద్యార్థుల హాజరు


పరీక్ష సరళి పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి18: జిల్లాలో పదో తరగతి తొలి పరీక్ష ప్రశాంతంగా సాగింది. మొదటి రోజు పరీక్షకు జిల్లావ్యాప్తంగా 99.78 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 47 కేంద్రాల్లో విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరయ్యారు. నిర్మల్‌లోని రాంనగర్ ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాసే తీరును పరిశీలించారు. కల్పించిన సౌకర్యాలు ఆరా తీశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తొలిరోజు భాషా పరీక్షకు 8,923 మంది విద్యార్థులకు గానూ 8,903 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈవో రవీందర్‌రెడ్డి, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ రాజు, తదితర అధికారులు తనిఖీ చేశారు.

ఖానాపూర్‌లో 100శాతం హాజరు

ఖానాపూర్: మండలంలో తొలిరోజు పదో తరగతి పరీక్షకు 100 శాతం విద్యార్థులు హాజరయ్యారు. మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థుల కోసం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఖానాపూర్‌లో 240 మంది, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో 240 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 203 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 100 శాతం హాజరు నమోదైనట్లు మండల విద్యాధికారి మధుసూదన్ తెలిపారు. ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాలను ఖానాపూర్ సీఐ సైదారావు, తహసీల్దార్ శివరాజ్, ఎస్సై లింబాద్రిలు పరిశీలించారు.

దస్తూరాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకొని హాల్ టికెట్ నెంబర్లను వారికి కేటాయించిన గదులలో కూర్చొని మొదటి రోజు తెలుగు పరీక్షను ప్రశాంతంగా రాశారు. మొదటి రోజు పదో తరగతి పరీక్షలో మొత్తం 170 మంది విద్యార్థులకు 170 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ వెంకట రమణ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎస్సై యాసిర్ అరాఫత్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించారు. స్థానిక ఎస్సై ప్రభాకర్ రెడ్డి సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ మాడల్ పాఠశాలలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చీఫ్ సూపరింటెండెంట్ ఆడెపు రాజేశ్వర్, డిపార్టుమెంటల్ ఆఫీసర్ రాజేశ్వర్‌లు సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ పరీక్షల్లో 197 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. ఒక విద్యార్థి గైర్హాజరై 196 మంది పరీక్షలకు హాజరైనట్లు ఆయన తెలిపారు.

లక్ష్మణచాంద: మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు విద్యార్థిని విద్యార్థులు వంద శాతం హాజరయ్యారు. లక్ష్మణచాందలోని కస్తూర్బా గాంధీ ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రంలో 199 మందికి 199 మంది విద్యార్థులు, వడ్యాల్ ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రంలో 138 మందికి 138 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పరీక్ష నిర్వహణను తహసీల్దార్ జానకి, ఇన్‌చార్జి ఎంఈవో మధుసూదన్‌లు పర్యవేక్షించారు. వీరి వెంట డీటీ రోహిదాస్, సీఆర్పీ సుధాకర్, తదితరులు ఉన్నారు.

'చెన్నూరు నుంచి బాసర రైల్వే లైన్‌కు హామీ ఇచ్చే పార్టీకే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు'

ఖానాపూర్, మార్చి18: చెన్నూరు నుంచి బాసర వరకు రైల్వేలైన్ ఏర్పాటుపై హామీ ఇచ్చిన పార్టీకే తమ ప్రాంత ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇస్తారని రైల్వే లైన్ సాధన సమితి వ్యవస్థాపక నాయకులు రవి కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో తాము చాలాసార్లు అధికారంలో ఉన్న పార్టీలకు దరఖాస్తులు ఇచ్చామన్నారు. ఇకనైనా రాజకీయపార్టీలు స్పందించి చెన్నూరు నుంచి బాసర వరకు రైల్వే లైన్ ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెన్నూరు నుంచి బాసర వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే చెన్నూరు, మంచిర్యాల, లక్సెట్టిపేట, జన్నారం, ఖానాపూర్, నిర్మల్, భైంసా ప్రాంతాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై హామీ ఇస్తేనే తమ ప్రాంతంలో ప్రచారానికి రావాలని తెలిపారు.

మహిళ కాలేయంలో 2 లీటర్ల చీము

● నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

నిర్మల్‌అర్బన్, మార్చి18: నిర్మల్ జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స అందించి ఓ మహిళ కాలేయంలో నుండి 2 లీటర్ల చీము గడ్డలు తొలగించి ప్రాణాలు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన గాయి పద్మ అనే 55 ఏళ్ల మహిళ తీవ్రమైన జ్వరం, కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరింది. వైద్య పరీక్షలు నిర్వహించిన సర్జికల్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ జి. రాకేష్ తొలిసారి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మినిమల్ ఆక్సెస్ పద్ధతి ద్వారా కోత లేకుండా 2 లీటర్లకు పైగా చీము తొలగించారు. ఈ సందర్భంగా డా. రాకేష్ మాట్లాడుతూ రోగి పూర్తిగా కోలుకుంటుందని తెలిపారు. నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ కాలేజీ వచ్చిన తర్వాత సౌకర్యాలు చాలా మెరుగుపడ్డాయని క్లిష్టమైన రోగాలకు మంచి చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుంటాల, మార్చి, 18: కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామానికి చెందిన గుద్దేటి భూమన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మృతికి గల కారణాలు అడిగితెలుసుకున్నారు. ఆయనవెంట ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, కుంటాల మండల మాజీ ఎంపీపీ భోజరాం పటేల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓంప్రకాష్ లడ్డా, శంకర్ చౌహాన్, తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

● ఖానాపూర్ మండలంలో 16 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు: తహసీల్దార్ శివరాజ్

ఖానాపూర్, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఖానాపూర్ మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్, ఎస్సై లింబాద్రిలు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివరాజ్, ఎస్సై లింబాద్రిలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను నమోదు చేశారు. ఖానాపూర్ మండలంలో అడవి సారంగాపూర్, గోసంపల్లె, పాత ఎల్లాపూర్, రాజుర గ్రామంలో 2, సుర్జాపూర్ 2, తిమ్మాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 8 ప్రదేశాలలో 16 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 35 ప్రాంతాల్లో 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపిన అధికారులు మొత్తం 40,320 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న దృశ్యం

కుంటాల, మార్చి, 18 : గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వందశాతం పన్నులు వసూళ్లకు సిబ్బంది కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. సోమవారం కుంటాల మండలంలోని అందకూర్ గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన గోదాంను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన నర్సరీని పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీలో మొక్కల పెంపకం, స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం తదితర వాటిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న 274 మరుగు దొడ్ల నిర్మాణం పనుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందకూర్ పంచాయతీ సెక్రటరీ రమ్య ఇక్కడి సిబ్బంది పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శి రమ్య, టీఏ శశిందర్, ఎఫ్ఏ భోజన్న తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ స్థానమే గెలుపు లక్ష్యంగా పని చేద్దాం

● సెడ్మకి ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న సెడ్మకి ఆనంద్

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 18: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానమే గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ పార్లమెంటరీ కో ఆర్డినేటర్ సెడ్మకి ఆనంద్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు పని చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తుందన్నారు. ఇందులో నాయకులు తదితరులున్నారు.



ఇచ్చోడలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



సాంఘిక సంక్షేమ పాఠశాల వద్ద పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు



అందర్ బంద్‌లో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు

● పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

బోథ్, మార్చి 18 :మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలలో 650 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 649 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో 202 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఒకరు గైర్హాజర్ అయ్యారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. కౌటా (బి) సోనాల రెండు సెంటర్లలో పరీక్షలు రాశారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకొని వారివారి హాల్ టికెట్ నెంబర్లను చూసుకోవడం జరిగింది.

ఇచ్చోడ:పదోతరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలవ్యాప్తంగా నాలుగు కేంద్రాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. విద్యార్థులు కేంద్రాలకు నిర్ధేశిత సమయానికంటే ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులను పరిశీలించిన తరువాతనే కేంద్రాలలోనికి పంపించారు. తొలి రోజు పరీక్షకు 977 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 973 మంది విద్యార్థులు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి ఉదయ్‌రావ్ తెలిపారు.

జైనథ్:జైనథ్ మండలంలోని పెండల్‌వాడ, గిమ్మా, జైనథ్ రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షల కేంద్రాల్లో సోమవారం మొదటి రోజు జరిగిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పెండల్‌వాడ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 76 విద్యార్థులకు గాను మొత్తం విద్యార్థులుజైనథ్ మొదటి మోడల్ స్కూల్ కేంద్రంలో 142 మంది విద్యార్థులకు గాను మొత్తం మంది విద్యార్థులు హాజరయ్యారు. దీంతో పాటు గిమ్మా ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో మొత్తం విద్యార్థులు 219 గాను మొత్తం విద్యార్థులు జైనథ్ ఆదర్శ పాఠశాలలో మొత్తం 178 విద్యార్థులు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఈ కేంద్రాలను జైణథ్ ఎంఈఓ శ్రీనివాస్, జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్, ఎస్సై కె.పురుషోత్తంలు తనిఖీ చేశారు. వారి వెంటక పరీక్షల సూపరింటెండెంట్‌లు, డీవోలు ఇన్విజిలెటర్లున్నారు.

తలమడుగు:మండలంలో ప్రారంభమైన పదోతరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటన చోటు చేసుకోకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అదే విధంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలను తహసీల్దార్ రాజమోహన్ ఎస్సై ధనశ్రీలు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని ఎవరు గుంపుగా వెళొద్దన్నారు. అదే విధంగా బరంపూర్ హైస్కూల్లో తలమ డుగు హైస్కూల్లో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రం అధికారులు పరిశీలించారు.

భీంపూర్: భీంపూర్ మండలం అందర్ బంద్ పదవ తరగతి పరీక్ష కేంద్రంలో సోమవారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కరంజి (టి), అర్లి(టి) భీంపూర్ ఉన్నత పాఠశాలలు, అందర్ బంద్ ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి మొత్తంగా 115మంది విద్యార్థులు కాగా అందులో తొలిరోజు 114 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఒకరు గైరహాజరయ్యారు. తహసీల్దార్ సత్యనారాయణ రావ్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. భీంపూర్ పోలీసులు 144 సెక్షన్ బందోబస్తు నిర్వహించారు.

ఇంద్రవెల్లి: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పదో తరగతి పరీక్షల కోసం మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేందాల వద్దకు విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు చేరుకోవడం కనిపించింది. పరీక్షా నిర్ణీత సమయానికి ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష మొదటి రోజు కావడంతో విద్యార్థుల ముఖాల్లో ఉత్కంఠ కనిపించింది. విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులు కూడా కేంద్రాల వద్దకు తరలివచ్చారు. కౌన్సిలింగ్ నిర్వహించి ధైర్యాన్ని నింపారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని వసతులతో కూడిన ఏర్పాట్లు చేశారు. మండలంలో మూడు కేంద్రాలలో 673 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజర్యయ్యారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాల వద్ద క్షుణ్ణంగా తనికీ చేసిన తర్వాతనే పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. విద్యార్థులు ఏ తరగతి గదిలో తమ నంబర్‌ను కేటాయించారో తెలుసుకోవడానికి అత్యుత ప్రదర్శించారు.

ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి కప్‌ను సాధించాలి

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి18:జాతీయ స్థాయి ఖోఖో క్రీడా పోటీల్లో రాష్ట్ర జట్టులో పాల్గొంటున్న క్రీడాకారులు క్రమశిక్షణతో మంచి ప్రతిభను ప్రదర్శించి కప్‌ను సాధించాలని ఆదిలాబాద్‌జిల్లా ఓలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ఢిల్లీలో ఈ నెల 28న జరిగే ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఉట్నూర్‌లోని కొమురంభీం కాంప్లెక్స్‌లో సోమవారం ప్రారంభమైన శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఖోఖో, కబడ్డీ క్రీడలు ఎక్కువగా ఆడుతారని తెలిపారు. 1980 జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తాము సైతం ఉత్సాహంగా గ్రౌండ్‌ను సిద్ధం చేశామని గుర్తు చేశారు.ఇన్ఫ్‌స్ట్రక్చర్ ఉన్న లేకున్నా క్రమశిక్షణతో ఆడి ప్రతిభను కనబర చాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఏఎస్ఓ హేమంత్, కోచ్‌శివకృష్ణ, ఆనంద్‌కుమార్, కార్తీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● డీఎల్‌పీవో ఫణీంద్రరావు



తలమడుగులో మరమ్మతులు పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

తలమడుగు, ఫిబ్రవరి18: వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో ఫణీంద్ర రావు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున గ్రామాలు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మరమ్మతుల కోసం గ్రామ పంచాయతీ ఆర్‌డబ్ల్యుఎస్ నిధుల ద్వారా పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పంచాయతీ సెక్రటరీలు, గ్రామాల్లో ఉండి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా వంద శాతం ఇంటి పన్నులు ఈ నెలాఖరు గల పూర్తి చేయాలని కోరారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికలు కూడా అమలువచ్చినందున ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో రాజకీయ నాయకుల ఫోటోలు ఉండకూడదన్నారు. అనంతరం తలమడుగు పంచాయతీకి సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.తలమడుగు పంచాయతీలో వాటర్ ట్యాంక్ వద్ద మరమ్మత్తులు చేపట్టడంతో ఆ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఇందులో ఎంపీఓ వినోద్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ అశోక్, అభయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కర్నూల్ జిల్లాలో ఎంపీఈఓను ఎంపీపీ కొట్టినందుకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపడం జరిగిందని డీఎల్‌పీఓ ఫనింద్రరావు, ఎంపీఓ వినోద్, పంచాయతీ సెక్రటరీ అభయ్‌కుమార్, అశక్షక్‌లు నిరసన తెలిపారు.

'ఆరు గ్యారెంటీల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం'

జైనథ్, మార్చి 18: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు రైతులకు ఆరు గ్యారెంటీల ఆశ చూపిన సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే బీజేపీ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయ లశంకర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. మోదీ పాలనకు బీజేపీ సిద్ధాం తాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు సోమవారం జైనథ్ మండలంలోని బెల్లూరి గ్రామంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులతో పాటు యువకులు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ సమక్షంలో సుమారు 300 మంది బీజేపీ పార్టీలో చేరారు. చేరిన వారికి ఎమ్మెల్యే బీజేపీ పార్టీ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు ఎకరానికి రూ.15వేలు బ్యాంకుల్లో జమ ఏమైందని ప్రశ్నించారు. గతంలో కేంద్రం ఎన్నో రకాల నిధుల ఇస్తే డబుల్ బెడ్ రూంలకు వాడుకొని అవి ఏలబ్ధిదారులకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నేటికి కట్టుబడి ఉందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జైనథ్ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్,



బీజేపీ పార్టీలో చేరిన కాప్రీ మాజీ బీఆర్ఎస్ సర్పంచ్ రవీందర్,యువకులు

జిల్లా పార్టీ అధికార ప్రతినిధి చిల్కూరి జ్యోతిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పోతరాజురమేష్, ఎంపీటీసీ లోకకరుణాకర్‌రెడ్డి, నాయకులు పెండల్‌వాడ అశోక్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, బెల్లూరి ప్రవీణ్‌లతో పాటు బెల్లూరిగూడ బెల్లూరి గ్రామ యువకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనస్‌ను వెంటనే చెల్లించాలి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి18: ఆదివాసీలకు తునికాకు సేకరణ ప్రధాన ఆదాయం, ఉపాధిగా ఉందని, పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసంసచిన్ అన్నారు.సోమవారం అటవిశాఖ కార్యాలయం ఎదుట టీఏజీఎస్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. కూలీలకు తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈసందర్భంగా టీఏజీఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పూసంసచిన్ మాట్లాడుతూ ఆదివాసులు వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణ పైనే ఆధార పడుతున్నారన్నారు.2016 నుంచి తునికాకు బోనస్ చెల్లించని కారణంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తునికాకు సేకరణను ఆపడం సరికాదన్నారు. కాంట్రాక్టర్ పై ఆధారపడ కుండా రాష్ట్ర ప్రభుత్వమే తునికాకు సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకరాఘవులు, నాయకులు ఉయికవిష్ణు, ఆదివాసులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న పురోహితులు

భైంసా,మార్చి 18: పట్టణంలోని మహాలక్ష్మీ జ్యూవెల్లరీ మార్కెట్ పదిలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి పుష్కరబ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. భక్తుల కోలాహలం మధ్య వేద పండితులు మూల మూర్తులకు అభిషేకములు, నిత్యార్చనహారతి వంటి అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవ కార్య క్రమాలు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి శిష్యులైన శ్రీమాన్ చక్రవర్తుల సుధన్వా చార్య (యాజ్ఞచారి) స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. అంకురార్పణ పూజ కార్యక్రమాలకు పట్టణ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హజరయ్యారు. సోమవారం ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వరకు కొనసాగనున్నాయి.

వైభవంగా అగ్గి మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన

● తర్లపాడ్‌లో మూడు రోజులపాటు కొనసాగుతున్న ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

ఖానాపూర్,మార్చి18: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో అగ్గి మల్లన్న స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు సోమవారం అత్యంత వైభవంగాప్రారంభమయ్యాయి.ఈవేడుకల్లో భాగంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు వేద పండి తులు మామిడిపల్లి హరీష్ కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమైనట్లు ఆయన పే ర్కొన్నారు. మంగళవారం కుంకుమార్చన, బుధవారం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తామ న్నారు. బుధవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ప్రతిష్ఠాపన వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడపకు చెందిన వేద పండితులు బ్రహ్మశ్రీ శెట్టిపల్లి మాధవాచార్యులు, వరంగల్‌కు చెందిన బ్రహ్మశ్రీ ఎలకంటి వెంకటాచార్యులు, తర్లపాడ్ ఓంకారేశ్వర స్వామి ఆలయ పూజారి, మామిడిపల్లి హరీష్ కుమారాచారిలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అగ్గి మల్లన్న స్వామి దేవస్థానం కమిటీ తెలిసింది.

24న ఖానాపూర్‌లో హోలీ

ఖానాపూర్, మార్చి 24 : ఈ నెల 23వ తేదీన ఖానాపూర్‌లో కామ దహనం 24వ తేదీన హోలీ పండుగలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ తెలిపారు. హిందూ ఉత్సవ సమితి ఖానాపూర్ పట్టణ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం వేద పండితుల సమక్షంలో హోలీ నిర్వహణకు తేదీని ఖరారు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రతి ఏడాది జరుపుకున్నట్లే ఈ ఏడాది కూడా కలిసికట్టుగా హోలీ వేడుకలను నిర్వహించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, 7వ వార్డు కౌన్సిలర్ కిషోర్ నాయక్, హిందూ ఉత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంత్రరాజం సురేష్, హిందూ కమిటీ ఉపాధ్యక్షులు శెట్టి శ్యామ్, వీడీసీ పెద్దలు బీసీ రాజన్న, సతీష్ రావు దేశ్‌పాండే, కమిటీ సభ్యులు బీసీ రమేష్, గౌరీకర్ రాజు, తోట హనుమంతు, తదితరులున్నారు.


ఓటును బాధ్యతగా వినియోగించుకోవాలి

తాంసి, మార్చి 18: సార్వభౌమాధికారాన్ని కాపాడే ఓటుహక్కును ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని కళాజాతా బృందం సభ్యులు పలు జానపద గీతాల ద్వారా ప్రజలను చైతన్య పరిచారు. సోమవారం ఎన్నికల సంఘం కలెక్టర్ ఆదేశాల మేరకు కళాజాతా బృందం తాంసి మండలం జామిడిలోని ముఖ్యకూడలి వద్ద ఓటుహక్కుపై అవగహన కల్పించారు. ప్రతీఒక్కరు బాధ్యతాయుతంగా ఓటు వేయాలని జానపద గీతాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో గట్టు వెంకట్‌రావు, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు అగ్నిపరీక్ష!



- గులాబీ పార్టీకి సవాల్‌గా మారిన లోక్‌సభ ఎన్నికలు
- అధికారం లేక చేజారిపోతున్న ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు
- పార్లమెంట్ పరిధిలో ఇద్దరు ఎమ్మెల్యేల పైననే భారం
- గతంలో అధికారం ఉండగానే ఓటమి పాలైన పార్టీ అభ్యర్థి
- పార్టీ క్యాడర్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న అగ్రనేతలు



ఆదిలాబాద్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించడం బీఆర్‌ఎస్‌కు అగ్నిపరీక్షగానే మారింది. అభ్యర్థి గెలుపు కోసం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల క్యాడర్ ఒక్కటై పని చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల బరిలోకి దింపింది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపైనే తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ రెండు పార్టీలకు భిన్నంగా కాంగ్రెస్ లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతకు అవకాశం ఇస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో అధికారంలో ఉండగానే ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం బీజేపీ ఖాతాలో పడింది. ప్రస్తుతం పరిస్థితులు తలకిందులు కావడంతో గెలుపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 35శాతం ఓట్లను సాధించి ముందు వరుసలో నిలిచింది. నాలుగు నియోజక వర్గాల్లో గెలుపొందిన బీజేపీ 34శాతం ఓట్లతో రెండో స్థానం దక్కించుకుంది. కాంగ్రెస్ మాత్రం 19శాతానికే పరిమితమైంది. పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ బలంగానే కనిపిస్తున్న అధికారం కోల్పోవడంతో అంచనాలన్నీ తారుమారవుతున్నాయి. ఓటమి పాలైనప్పటి నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నికల వరకు మరికొంత మంది నేతలు పార్టీని వీడే అవకాశం ఉండడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రంసక్కు గెలుపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ఆ పార్టీ అభ్యర్థి గెలువడం అంత సులువైన పనేమి కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అగ్రనేతల బుజ్జగింపులు

పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఒక్కసారి ఓటమి పాలుకావడంతో నేతలంతా పక్కచూపులు చూస్తున్నారు. ఇప్పటికే పలువురు ముఖ్యనేతలు పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరి పోయారు. ముఖ్యంగా మాజీ ఎంపీ గోడం నగేష్, జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్థన్, డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డితో పాటు పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతలంతా పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తట్టుకుని నిలబడడం కొంతకష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రంగంలోకి దిగిన పార్టీ అగ్రనేతలు హరీశ్‌రావు, కేటీఆర్ నేరుగా జిల్లానేతలకు ఫోన్ చేస్తూ బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. అయిన పార్టీలో కొనసాగడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉండగా హావా నడిపించిన నేతలంతా ఇప్పుడు పూర్తిగా సైలెంటై పోతున్నారు. వ్యక్తిగత కారణాలు, వ్యాపారాలు, ఒత్తిళ్ల కారణంగా అధికార పార్టీ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. అధికారంలో ఉండగా ఓవర్‌లోడ్‌తో కనిపించిన కారు అధికారం దూరంకాగానే ఖాళీ అయిపోతుందన్న చర్చ జోరుగా సాగుతోంది.

ఏడు నియోజకవర్గాల్లో ఇద్దరే ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు నియోజక వర్గాలు ఉండగా రెండు నియోజక వర్గాల్లోనే ఆ పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారు. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేల పైననే పార్టీ అధిష్టానం పెద్దలు ఆశలు పెట్టుకుంటున్నారు. బోథ్ నియోజక వర్గంలో అనిల్‌జాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందిన లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం పార్టీ శ్రేణుల మద్దతు దక్కుతుందా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు ఈ నియోజక వర్గంలో పెద్దగా వలసలు కనిపించడం లేదు. మాజీ ఎంపీ గోడంనగేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావ్ మాత్రమే పార్టీని వీడారు. అయినా మండల, గ్రామస్థాయి క్యాడర్ అంతా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కోవలక్ష్మి గెలుపొందిన ఇక్కడ ఆదివాసీ ఓటర్లే కీలకం కానున్నారు. అలాగే పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు సొంత నియోజకవర్గం కావడంతో ఆదివాసీ ఓటర్లు బీఆర్‌ఎస్ వైపే మొగ్గుచూపే అవకాశం కన్పిస్తోంది. ఈ రెండు నియోజక వర్గాల్లోనే పార్టీ పరిస్థితి కొంతమెరుగ్గా కనిపిస్తున్నా మిగితా ఐదు నియోజకవర్గాల్లో అంతంత మాత్రంగానే అన్నట్లుగా పార్టీ పరిస్థితి మారిందంటున్నారు.

పార్టీ అభ్యర్థి మార్పు

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున మాజీ ఎంపీ గోడం నగేష్ పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఈ సారి ఆయన పార్టీని వీడడంతో బీజేపీ ఆయనను పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో బీఆర్‌ఎస్ ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును అభ్యర్థిగా ప్రకటించింది. ఈ సారి బీఆర్‌ఎస్‌కు కొత్త అభ్యర్థి కావడం కూడా కొంత ఇబ్బందికరంగానే కన్పిస్తోంది. బీఆర్‌ఎస్ తరపున గోడం నగేష్ ఎన్నికల బరిలో ఉండిఉంటే కొంతవరకైనా సానుభూతి కలిసి వచ్చేదన్న టాక్ వినిపిస్తుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండగానే ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం బీజేపీ ఖాతాలో పడింది. ఈ సారి అధికారం కోల్పోవడం పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే స్థాయి నేతలు ఇతర పార్టీల్లో చేరిపోవడం, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో కేసీఆర్ ఈమేజ్ భారీగా పడిపోవడం, సంక్షేమ పథకాల్లో అవినీతిఅక్రమాలు బయటపడడంతో ప్రజల్లో పార్టీపై ఓ రకమైన అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటన్నింటినీ తట్టుకుని ఎన్నికల్లో విజయం సాధించడం బీఆర్‌ఎస్‌కు తేలికైనా పనేమీ కాదంటున్నారు. ఒకవేళ త్రిముఖ పోటీ ఏర్పడితే పార్టీ అభ్యర్థికి గెలుపు అవకాశాలు ఉంటాయన్న టాక్ వినిపిస్తుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పోషణ్ పక్వాడను అన్ని అంగన్‌వాడీల్లో నిర్వహించాలి

- కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి18: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ (పోషణ పక్షం) కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. పెరటితోటలో అనుబంధ పౌష్టిక ఆహారంపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించాలని గర్భిణీ, బాలింత, చిన్నారులల్లో పౌష్టికాహార లోపం అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ పక్వాడ (పోషణ పక్షం) నిర్వహించాలని సూచించారు. పోషణ్‌పక్షం కార్యక్రమంపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజార్షిషా ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలదేవిలతో కలిసి మహిళ శిశు సంక్షేమ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. చిరు ధాన్యాల ఉపయోగం, ప్రాధాన్యత గురించి ఈనెల 23 వరకు గ్రామస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పించాలని, వచ్చే బుధవారం విలేజ్ హెల్త్ శానిటేషన్, న్యూట్రిషన్ డే సందర్భంగా అన్నిఅంగన్‌వాడీ కేంద్రంలో లైన్‌డిపార్ట్‌మెంట్ వారిని పిలిచి వంటకాల ప్రదర్శన రక్తహీనత తదితర అంశంపై నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని ప్రతీనెల మొదటి బుధవారం నిర్వహించాలని, దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో ఐసీడీఎస్, హెల్త్ ఎడ్యుకేషన్ సివిల్‌సప్లయి డీఆర్డీఏ పంచాయతీరాజ్ అధికారులున్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

పది తొలి పరీక్ష ప్రశాంతం

- జిల్లావ్యాప్తంగా 53 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాసిన విద్యార్థులు
- మొదటిరోజు 10,367 మంది హాజరు



హాల్ టికెట్ నెంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి18: పదో తరగతి తొలి పరీక్ష సోమవారం ప్రశాంతంగా సాగింది. ఆయాకేంద్రాల్లో ఉదయం 8గంటల 45నిమిషాల నుంచి విద్యార్థులకు అనుమతించారు. విద్యార్థులను క్షుణంగా పరిశీలించిన అనంతరం లోనికి అనుమతించారు. తొలిరోజు 10,402 మందికి గాను 10,367మంది విద్యార్థులు పరీక్ష రాయగా 35మంది గైర్హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు. జిల్లావ్యాప్తంగా 53 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పట్టణంలోని ఆయా పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోని వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఉట్నూర్: మండలకేంద్రంలో పదో తరగతి పరీక్షల కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు నాలుగు ప రీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. పూలాజిబాబా పాఠశాలలో ఏసెంటర్లో చీఫ్ సూపరింటెండెంట్‌గా బానోతు తిరుపతి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా మనోజ్‌రెడ్డి, బిస ఎంటర్లో సీఎస్‌గా మనోహర్, డీవోగా సంతోష్, జిల్లా పరిషత్ సెకం డరీ పాఠశాలలో సీఎస్‌గా జాదవ్‌రమేష్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా నరేందర్, గిరిజన సంక్షేమ బాలికలు ఆశ్రమ పాఠశాలలో సీఎస్‌గా మాణిక్‌రావు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా దన్నూల ఆధ్వర్యంలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు 960 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు నిర్వాహకులు తెలిపారు.



విద్యార్థులు హాల్‌లోకి అనుమతిస్తున్న సిబ్బంది



సమయం ముగుస్తోందని పరీక్షా కేంద్రానికి పరుగులు పెడుతున్న విద్యార్థి

జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి: టీఎస్‌ఎఫ్



లోగోను ఆవిష్కరిస్తున్న పలు సంఘాల నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 18: జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుతాన్ని కోరారు. పట్టణంలో యాదవ సంఘం భవనంలో తెలంగాణ స్టూడెంట్‌ఫోరం(టీఎస్‌ఎఫ్) లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసి, శాస్త్ర విద్యా విధానం అమలుచేసి, కామన్‌స్కూల్ విద్యావిధానం కోసం కృషి చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురియం బర్స్‌మెంట్ విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్‌కాస్మొటిక్ చార్జీలు పెంచి విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం తెలంగాణ స్టూడెంట్ ఫోరం టీఎస్‌ఎఫ్ కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడంగణేష్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, నారా యణ, ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడంరేణుక, పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజ్మీ రవినోద్‌నాయక్, ఏఐఎస్బీ రాష్ట్ర అధ్యక్షుడు జీవారే రాహుల్, ఏఎస్యూ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదేరావ్; కార్యదర్శి అశోక్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శిగణేష్, జిల్లాఅధ్యక్షుడు జి.సుజయ్, టీఎస్‌ఎఫ్ జిల్లాఅధ్యక్షుడు బి.రాహుల్, ఉపాధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ఇఫ్తార్, తదితరులున్నారు.

తలమడుగులో వడగండ్ల వాన

- మండలంలో భారీ వర్షం
- వందలాది ఎకరాలు నీటిపాలు



భారీ వర్షానికి నేలమట్టమైన పొగాకు పంట



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తలమడుగు, మార్చి18: మండలంలోని బరంపూర్, దేవాపూర్, పల్లి(బీ), పల్లి (కే), సజ్జాపూర్, చర్లపల్లి ఝరి తదితర గ్రామాల్లో సోమవారం వడగండ్ల వాన కురిసింది. ఈ అకాల వర్షంతో వందలాది ఎకరాల్లో సాగువుతున్న జొన్న, మొక్కజొన్న పొగాకు, శనగపంట నేలవాలాయి. చేతికి వచ్చిన పంట కళ్ల ముందే నీటి పాలైందని రైతులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బరంపూర్ శివారు ప్రాంతంలో దాదాపు 500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. భారీవర్షాలకు నష్టపోయిన పంటలను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆదేశాల మేరకు పంటను పరిశీలించినట్లు రైతు సంఘం జిల్లా నాయకులు కేదరేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి, మాదురమా కాంత్ తెలిపారు. ప్రభుత్వం వెంటనే సర్వే చేయించి పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని కోరారు. గతేడాది కూడా అకాలవర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించలేదని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

స్పందించారు.. ట్రాఫిక్‌ను నియంత్రించారు!

- ఇచ్చోడ రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణకు అధికారుల చర్యలు
- రోడ్డుపై వాహనాలు, బండ్లు ఆపొద్దని ఆదేశాలు



జేసీబీ సహాయంతో బస్టాండు బల్లాలను తరలిస్తున్న ఎస్సై నరేష్, సిబ్బంది

ఇచ్చోడ, మార్చి18: ఇచ్చోడలో గతకొంత కాలంగా ఇచ్చోడ ప్రధాన రహదారిపై ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు అధికారులు నడుం బిగించారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'ఇచ్చోడలో నియంత్రణ లేని కూడళ్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు తక్షణమే స్పందించారు. ఇచ్చోడలోని ప్రధాన కూడళ్లలో ప్రత్యేక సిబ్బంది నిలబడి ట్రాఫిక్‌ను నియంత్రించారు. బస్సులు ఆగేచోట తరుచూ ట్రాఫిక్‌జాం అవుతుండడతో బస్సులను వేర్వేరు చోట్లలో ఆపేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం వారసంతకావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురైనప్పడికీ ట్రాఫిక్ సమస్య కొంతతగ్గింది. ట్రాఫిక్ సమస్య ఉండకూడదంటే ఆర్టీసీ బస్సులు నిలిపే స్థానాలు మార్చాలని నిర్ణయించిన పోలీసులు, ఎంపీడీవో గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే బస్సులు నిలిపే స్థానాలను మార్చి ఆర్టీసీ అధికారులతో కలిసి ఫ్లెక్సీ తయారుచేయించి బస్సులు నిలిపేస్థానంలో ప్రయాణీకుల సౌకర్యార్థం కూర్చోవడానికి బల్లలను ఏర్పాటుచేశారు. తోపుడు బండ్లు రోడ్డుపైకి రావద్దని రోడ్డుపై ఉన్న షెడ్లను తీసి వేయించారు. రోడ్డుపై అడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు చేపడతామని సీఐ భీమేష్ తెలిపారు. ట్రాఫిక్‌జాంను నియంత్రించేందుకు ఎంపీడీవో లక్ష్మణ్, ఈవో సూర్యనారాయణ, సీఐభీమేష్, ఎస్సై నరేష్, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్యలు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

పన్నీర్ తయారు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

గుడిహత్నూర్, మార్చి18: మండలకేంద్రానికి చెందిన శివరాజ్ నవదుర్గ స్వయం సహాయక గ్రూపు సభ్యులు వారికుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన మిల్క్, పన్నీర్ తయారుకేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వినియోగదారులకు స్వచ్ఛమైనపాల పన్నీర్ అందించాలన్నారు. చుట్టుపక్కల మండల ప్రజలు, వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, మాజీ ఏఎంసి, చైర్మన్ ఆడే శీల, మాజీ సర్పంచులు తిరుమల్ గౌడ్, రవినాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలి

తాంసి, మార్చి 18: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాపాలనలో ప్రజలు ఇచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో గడ్డ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన విభాగాన్ని నిర్వహించారు. కొన్ని గ్రామాలకు చెందిన లబ్ధిదారులు తమకు ఉపాధి కూలీ డబ్బులు రావడంలేదని విన్నవించారు. మరికొద్ది మంది తమ కరెంటుసమస్య పరిష్కరం కాలేదని విన్నవించారు. మరికొందరు తమకు ఉపాధిలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలన్నారు. ప్రతీ అధికారి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, ఎంపీఓ సుధీర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శివాలయంలో అన్నదానం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 18: పట్టణంలోని గంగపుత్ర శివాలయంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ప్రతీ సోమవారం అన్నదాన కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఆలయ పూజారి గంగాధర్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం సఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంపల్లి భూమన్న, మేకల అశోక్‌లు భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల కోరిక మేరకు ప్రతి సోమవారం ఆలయంలో అన్నదానం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎల్లుల భోజన్న, యు.రాములు,కుమ్మరి కృష్ణ, బొపంల్లి కృష్ణ, తోకల కిరణ్, చిట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.